ప్రియురాలు పిలిచె

– డా.యండమూరి వీరేంద్రనాథ్

(గత సంచిక తరువాయి)

అధ్యాయం – 8

ఉత్తరమంటే శృతి చేసిన వీణలా ప్రతి అక్షరం మనసుని మీటాలట. బ్రతుకు తీగెల మీద మీ జ్ఞాపకం సరిగమలు వాయిస్తూంటే నేనొక గాఢమైన అలౌకికానందంలో మునిగిపోయి, ఇదిగో ఇన్నాళ్ళకు తేరుకుని ఉత్తరం వ్రాయటం మొదలుపెట్టాను. రేపు మధ్యాహ్నం నేనొస్తున్నాను. తాజ్ ఇంటర్నేషనల్‌లో రూమ్ బుక్ అవుతుంది. రాగానే ఫోన్ చేస్తాను. ఫోన్ చేసిన అరగంటలో మీరు నా దగ్గర ఉండాలి. మీర్రాకపోతే – సరిగ్గా అరగంట తరువాత ఆత్మహత్య చేసుకుంటాను... మీ అనూజ్ఞ.

2

ఢిల్లీ నుంచి వచ్చిన విమానం ఎయిర్ పోర్ట్ లో ఆగింది. ఐదు నిముషాల తరువాత అనూజ్ఞ బయట కొచ్చింది. లోపలి లాంజ్‌లోకి రాగానే ఆమె కళ్ళు కార్తికేయ కోసం వెదికాయి. తనకోసం కార్తికేయ వస్తాడా? ఆమెకి ఉద్విగ్నంగా ఉంది.

అంతలో ఒక వ్యక్తి ఆమె వద్దకు వచ్చి, ''మీ పేరు అనూజ్ఞ కదూ'' అన్నాడు. అవునన్నట్లు తలూపింది. ''నా పేరు ఉస్మాన్. మిమ్మల్ని హోటల్ దగ్గర దింపటం కోసం నన్ను కార్తికేయ పంపారు. ఆయన అర్జెంటు పని ఉండి రాలేక పోయారు. హోటల్ కి వచ్చి కలుసుకుంటానన్నారు''.

ఇద్దరూ కారెక్కారు. ''తాజ్ ఇంటర్నేషనల్ హోటల్‌కేనా మాడమ్?''

''అవును'' అన్నదామె. వచ్చింది అశ్వత్థామ అనీ, తన పేరు అబద్ధం చెప్పాడనీ ఆమె ఊహించ లేదు. 'తను తాజ్–ఇంటర్నేషనల్‌లో రూమ్ తీసుకున్న సంగతి కూడా కార్తికేయ ఇతనికి చెప్పాడంటే ఇద్దరూ మంచి స్నేహితులై ఉంటారు' అనుకుంది.

కారు హోటల్ ముందు ఆగింది. హోటల్ రిజిష్టర్ కార్డు పూర్తిచేయబోతోంటే స్వరం తగ్గించి, ''మీ అడ్రసూ, పేరు. వ్రాయకండి'' అన్నాడు.

ఆమె ఆశ్చర్యంగా ''ఎందుకు?'' అని అడిగింది.

''ఏమో. కార్తికేయ మీ అసలు పేరు వ్రాయొద్దన్నాడు'' మిగతా విషయాలు తనకి తెలియనట్టు అన్నాడు. ఆమె ఒక్క నిముషం తటపటాయించి 'రజిత' అని వ్రాసింది. ఆ తరువాత ఇద్దరూ లిఫ్ట్ ఎక్కి నాలుగో అంతస్తు రూమ్ నెం. 413 చేరుకున్నారు.

''తనకి వివాహం కాక ముందు నుంచీ మేమిద్దరం స్నేహితులం. మా వీధిలోనే ఉండేవాడు. ఇద్దరం పస్తులు పడుకున్న రోజులు కూడా ఉన్నాయి. శ్రీకళ్యాణిగారిని వివాహం చేసుకున్నాక అతని అంతస్తు మారిపోయింది'' అన్నాడు అశ్వత్థామ.

ఆమె మనసు చివుక్కుమంది. ఆమె తన మనసులో భావాల్ని బయటకు కనపడనివ్వకుండా ''మీరిద్దరూ అంత ప్రాణస్నేహితులన్న మాట'' అంది.

''అవును మాడమ్. మిమ్మల్ని కలవటానికి అతడు తహతహలాడిపోతున్నాడు. ఇంత కాలం జాప్యం చేసినందుకే అతను విచారిస్తున్నాడు.''

ఈ చౌకబారు వాక్యాలు ఆమెని మరింత బాధ పెట్టాయి. నవయవ్వన శోభాగుబాళింపుతో విచ్చిన మరుమల్లె... లలిత శృంగార కేళిలో నలగాలని అనుకుంటుంది కానీ, మధన ప్రేరిత కేళీ విలాసగాత్రమైన గ్రీష్మంలో వాడి రాలాలనుకోదు.

గదిలో ఆమెని వదిలి అతడు వెళ్ళిపోగానే అతడి వెనుక తలుపు నెమ్మదిగా మూసుకు పోయింది. అనూజ్ఞ అలాగే కుర్చీలో కూర్చుని ఉంది. ఎందుకో తెలీదు గానీ ఆమెకు దిగులేసింది. విమానం దిగగానే ఈ రకమైన ఆహ్వానం ఆమెకి నచ్చలేదు. తొలిసారి కార్తికేయ మీద కోపం వచ్చింది. జరుగుతున్న విషయమంతా అతడికి తెలీదనీ, తన చుట్టూ నెమ్మది నెమ్మదిగా ఒక వల బిగుసుకుంటోందనీ ఆమెకి తెలీదు.

అశ్వత్థామ ప్రతాపరెడ్డి దగ్గరకు వెళ్ళేసరికి సత్యం కూడా అక్కడే ఉన్నాడు. ముగ్గురూ కూర్చున్నాక ప్రతాపరెడ్డి చెప్పటం మొదలుపెట్టాడు: ''ఇంకో ఐదు నిముషాల్లో మీరిద్దరూ ఇక్కడ నుంచి బయల్దేరతారు. సత్యం కారులో వెనుక సీట్లో నువ్వు దాక్కుని కూర్చుంటావు''.

ఈ చివరి మాటలకి అశ్వత్థామ కొంచెం టెన్షన్ ఫీలయ్యాడు. అయినా మామూలుగానే ఉన్నాడు. ప్రతాపరెడ్డి కొనసాగించాడు. ''సత్యం కారు దిగి కళ్యాణి ఇంటి లోపలికి వెళతాడు. అక్కడి పరిస్థితి చూసి అతడు సైగ చేయగానే ఆమెకి కనపడకుండా ఆమె పడగ్గది దగ్గరగా వెళ్ళి దాక్కుంటావు. ఈ దాక్కోవటానికి సరి అయిన ప్లేస్ సత్యం ఇప్పటికే చూసి ఉంచాడు. అవునా సత్యం?'' సత్యం తలూపాడు. ''...శ్రీకళ్యాణితో మాట్లాడాక సత్యం వేరే చోట ఎలిబీ సృష్టించుకోవటానికి వెళ్ళిపోతాడు. తరువాత నువ్వు సైలెన్సర్ ఉన్న పిస్టల్‌తో ఆమెని చంపేస్తావు. ఈ లోపులో సత్యం హోటల్ కొచ్చి అనూజ్ఞతో

మాట్లాడి, శ్రీకళ్యాణి హత్య కార్తికేయ చేశాడని నమ్మేలా చేస్తాడు. ఒకవేళ కార్తికేయ మీద నేరం రుజువు కాకపోయినా, హత్యానేరం మన మీదకు రాదు. ఇంకేమైనా అనుమానాలున్నాయా?''

అశ్వత్థామ, సత్యం ఇద్దరూ లేచి నిలబడి ''లేవు'' అన్నారు.

శత్రు శిబిరంలో జరుగుతున్న ఈ సంచలనాన్ని గమనించిన వ్యక్తి మరొకరున్నారు. అతను పీటర్. స్వతహాగా డిటెక్టివ్ కాబట్టి అతని ఆలోచన్లు పాదరసంలా, చివరికి అనూజ్ఞని కూడా వదలకుండా సాగుతున్నాయి. 'అశ్వత్థామకీ, సత్యానికీ, అనూజ్ఞకీ ఏమైనా సంబంధం ఉందా? ముగ్గురూ కార్తికేయని వలలో వేసుకుని శ్రీకళ్యాణి అంతు చూడాలనుకున్నారా' అని కూడా ఆలోచిస్తున్నాడు. చివరికి అతడు ఒక నిర్ణయం తీసుకున్నాడు. రిస్క్‌తో కూడిన నిర్ణయమే అయినా పరిశోధనలో ఒక్కోసారి తప్పదు.

డైరెక్టుగా తాజ్ ఇంటర్నేషనల్‌కి ఫోన్ చేసి 413కి కనెక్షన్ ఇమ్మన్నాడు. అనూజ్ఞ బాత్రూంలో ఉందని నీళ్ళ చప్పుడు ద్వారా తెలుస్తోంది.అట్నుంచి 'హల్లో' అని ఆమె కంఠం వినిపించగానే ''నేను సత్యం ఫ్రెండ్‌ని మాడమ్. మీ ప్రయాణం బాగా జరిగిందో లేదో, హోటల్‌లో సౌకర్యంగా ఉందో లేదో సత్యంగారు కనుక్కోమన్నారు'' అన్నాడు.

''వ్వాట్ నాన్సెన్స్... సత్యం ఎవరు? మీకే రూం కావాలి?'' అట్నుంచి అనూజ్ఞ కంఠం చిరాగ్గా వినిపించింది. పీటర్ తేలిగ్గా ఊపిరి పీల్చుకుని ''సత్యం కార్తికేయ కజిన్'' అన్నాడు. కార్తికేయ పేరు చెప్పగానే ఆమె విసుగు మాయమైంది. ''ఏమో మరి నాకు తెలీదు. కార్తికేయ ఫ్రెండ్ ఉస్మాన్ మాత్రం విమానాశ్రయానికి వచ్చి నన్నీ హోటల్ వరకూ తీసుకొచ్చారు.''

మంచు విడిపోతున్నట్టు అనిపించింది పీటర్‌కి. ఉస్మాన్ పేరు మీద అశ్వత్థామ ఎయిర్–పోర్ట్ కి వెళ్ళి పరిచయం చేసుకున్నాడన్నమాట. ఆమె ఫోన్ పెట్టెయ్యబోతోంటే ''మీ గురించి కనుక్కోవటం కష్టమైంది. మీరు ఇంకో పేరుతో రూమ్ తీసుకున్నట్టున్నారు'' అన్నాడు.

అవతలి పక్కనుంచి కాస్త సందిగ్ధం. ''అవును.''

''మరి మీరే పేరుతో రూమ్ తీసుకున్నారో తెలియక కార్తికేయ మిమ్మల్ని ఫోన్ ద్వారా కాంటాక్టు చేయలేకపోయి ఉంటాడు మాడమ్.''

''మైగాడ్'' అంది అనూజ్ఞ... ''అలా చేయమని ఉస్మాన్ చెప్పాడే.''

''సర్లెండి మాడమ్. కార్తికేయకు నేను చెపుతాన్లెండి'' ఫోన్ పెట్టేశాడు పీటర్. అతడికి విషయం పూర్తిగా అర్థమైంది.

3

గూర్కా సెల్యూట్ చేసి గేటు తెరిచాడు. సత్యం కారు పోర్టికోలో ఆగింది. నౌఖర్లు లోపల ఎక్కడో పనిచేసుకుంటున్నారు. సత్యం కారు దిగి హాల్లోకి ప్రవేశించాడు. కాఫీ పైకి పంపించమని సోఫాలు తుడుస్తున్న నౌఖరుతో చెప్పాడు.

నౌఖరు వంటగదిలోకి వెళ్ళగానే సత్యం సైగ చేయటం, అశ్వత్థామ కార్లోంచి హాల్లోకి రావటం క్షణాల్లో జరిగిపోయాయి. ఆ ముసలాడిలో అంత చురుకుదనం చూసి సత్యానికే ఆశ్చర్యం వేసింది. ఈ పని అనుకున్నట్టు చేయగలడని నమ్మకం కుదిరింది. బెడ్‌రూమ్‌కి ముందు గదిలో సోఫాకీ, గోడకీ మధ్య స్థలంలో ఆశ్వత్థామని దాచి పెట్టి అతడు లోపలికి వెళ్ళాడు. శ్రీకళ్యాణి ఏదో పుస్తకం చదువుకుంటూంది. అతన్ని చూసి, 'రా సత్యం' అంది.

''కార్తికేయ లేడా?'' అంటూ ఫోన్ అందుకని ఆఫీసుకి డయల్ చేశాడు. అట్నుంచి కార్తికేయ లైన్‌లోకి రాగానే ''నువ్వు ఆఫీసులోనే ఉన్నావా? ఢిల్లీ నుంచి ఎవరో అనూజ్ఞ వచ్చిందట. నీ కోసం ఫోన్‌లో ప్రయత్నించి, దొరక్క నాకు చెప్పింది. గంటనుంచీ నీ కోసం ప్రయత్నిస్తున్నాను'' అన్నాడు.

కళ్యాణి అయోమయంగా వింటోంది. ఆమెకు ఈ సంభాషణ అర్థం కావటం లేదు. సత్యం అంటున్నాడు ''లేదు. తన పేరుమీద తీసుకోవద్దని నువ్వు చెప్పావటగా ఇంకేదో మారుపేరుతో రూము తీసుకుందట.''

కార్తికేయ ఏమంటున్నాడో కళ్యాణికి వినిపించలేదు.

''చెప్పలేదు. మరేం చెయ్యను? నువ్వు ఎక్కడున్నావో తెలీదాయె. అబ్బే. నేను ఇంటి దగ్గర్నుంచి కాదు. ఇంకా నయం. 'శ్రీకళ్యాణి ముందు నించా?' అనలేదు. ఆ మాత్రం నాకు తెలీదా?'' అని ఫోన్ పెట్టేశాడు. శ్రీకళ్యాణి ఇంకా దిగ్భ్రాంతిలోంచి తేరుకోలేదు.

"ఇంతకాలం నేను చెపుతూ వచ్చిన విషయాలేవీ నువ్వు నమ్మలేదు కళ్యాణీ. అందుకే బుజువుల కోసం ఇంతకాలం ఆగాను. కార్తికేయ అసలు స్వరూపం ఇప్పుడు సాక్ష్యాల్తో సహా దొరికింది'' అంటూ పది నిముషాల్లో అంతా క్లుప్తంగా చెప్పాడు.

కార్తికేయ ఇంటికి రావటానికి ఇంకా పదిహేను నిముషాలుంది. సత్యం లేచి నిలబడి ''కార్తికేయ ప్రతాపరెడ్డి మనిషే కళ్యాణీ! అతనూ అనూజ్ఞా ప్రేమికులు. అండమాన్స్‌లో హనీమూన్ గడిపారు. ఇప్పుడా అమ్మాయి ఈ ఊళ్ళోనే మారు పేరుతో హోటల్‌లో ఉంది. అది నీకు తెలియాలనే నీ ముందు నుంచి కార్తికేయకు ఫోన్ చేశాను. ఇప్పుడు నువ్వు చేయవలసిందల్లా వారి సంభాషణ ఫోన్ ఎక్స్‌టెన్షన్‌లో వినటం. దాంతో వాళ్ళ నాటకం పూర్తిగా బయటపడుతుంది'' అని అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు.

ఒంటిగంటకు ఇంకో ఐదు నిముషాలుందనగా కార్తికేయ ఇంట్లోకి ప్రవేశించాడు. ''పైన అమ్మగారు ఏదో ముఖ్యమైన పనిలో ఉన్నారు. ఎవరొచ్చినా డిస్టర్బ్ చెయ్యొద్దని చెప్పారు'' అన్నాడు నౌకరు. కార్తికేయ క్రిందే సోఫాలో కూర్చున్నాడు. సత్యం చెప్పిన విషయమే అతనిని కలవరపరుస్తోంది.

... సరిగ్గా ఒంటిగంటకి ఫోన్ మ్రోగింది. అతను చప్పున రిసీవర్ అందుకున్నాడు. పైన కళ్యాణి ఎక్స్‌టెన్షన్ ఫోన్ చేతుల్లోకి తీసుకుంది.

''నేనూ అనూజ్ఞని మాట్లాడుతున్నాను. మీరేనా... అబ్బా... రెండు గంటల్నుంచీ మీ కోసం ప్రయత్నిస్తున్నాను.''

''ఎక్కణ్నుంచి నువ్వు?''

''తాజ్ నుంచే.''

''నీ పేరు మీద రూమ్ లేదన్నారే?''

''ఇంకో పేరుమీద రూమ్ తీసుకో మన్నారటగా.''

''ఎవరు చెప్పారు?''

''మీ స్నేహితుడు... ఉస్మాన్.''

''ఏమిటీ?'' కార్తికేయ కంఠం కీచుమంది.

''అవును. మీరు పంపారని అతనే విమానాశ్రయానికి వచ్చాడు.''

''ఇంకేం చెప్పకు. వెంటనే అక్కడికొస్తున్నాను'' కార్తికేయ ఫోన్ పెట్టేశాడు. హాలు దాటి ముందు పోర్టికోలో కారు దగ్గరకి వచ్చాడు. అంతలో పైనుంచి బజ్జర్ మ్రోగింది. కార్తికేయ కారులో కూర్చుని స్టార్ట్ చేయబోతోంటే నౌఖరొచ్చి ''అమ్మగారు మిమ్మల్ని పిలుస్తున్నారు'' అని చెప్పాడు.

''అరగంటలో వస్తానని చెప్పు'' అనబోయి మనసు మార్చుకుని కారు దిగి పైకి వెళ్ళాడు. కళ్యాణి చేతిలో ఇంకా ఫోన్ అలాగే ఉంది. ''ఎవరు ఇప్పుడు మీతో మాట్లాడింది?'' సూటిగా అడిగింది.

''అంతా విన్నావా?'' తెల్లబోతూ అడిగాడు.

''విన్నాను. అందుకే అడుగుతున్నాను.''

''నన్ను అడిగితే అంతా చెప్పేవాణ్ణి. అలా వినటం తప్పు కదా?''

ఒకసారి 'తప్పు' అనే మాట వినపడగానే ఆమె రెచ్చిపోయింది. ''భార్య ఉండగా మరో స్త్రీతో సంబంధం పెట్టుకోవటం తప్పు కాదా?'' రెట్టించి అడిగింది.

అతడు గట్టిగా 'కళ్యాణీ' అని అరిచాడు. అతడు అంత గట్టిగా అరవటం ఆమె ఎప్పుడూ చూడలేదు. తమాయించుకుంటూ స్వరం మరింత హెచ్చించి, ''ఏం? మీరు చేస్తోంది తప్పు అనిపించటం లేదా?'' అంది.

''నన్ను వెళ్ళనీ. వచ్చాక అంతా చెపుతాను.''

''కాదు. చెప్పే వెళ్ళాలి.''

''అంత టైమ్ లేదు'' గుమ్మం దగ్గరకి వెళుతూ అన్నాడు.

''ఆగండి'' గట్టిగా అంది. ''నేను కదలలేననీ, జీవచ్ఛవంలా పక్క మీదే ఉంటాననేగా మీరు అలా వెళ్ళిపోతున్నారు'' కోపమూ, నిస్సహాయత మిళితమైన స్వరంతో నిలదీసింది. కార్తికేయ ఆమె దగ్గరగా వచ్చి అనునయంగా తల మీద చెయ్యి

వేసి, ''ఆవేశపడకు ప్లీజ్.'' అన్నాడు. ఆమె చేతిని తీసేసింది. అతడు ఆమె వైపు కన్నార్పకుండా ఓ క్షణం చూసి బయటకు నడిచాడు.

భార్యాభర్తల ఘర్షణని నౌఖర్లు క్రింద నుంచి వింటున్నారు. ఉన్నట్టుండి పై సంభాషణ ఆగిపోవటాన్ని కూడా గమనించారు. ఆ నిశ్శబ్దంలోంచి కార్తికేయ వడివడిగా మెట్లు దిగి కారెక్కి రయ్యిన వెళ్ళిపోవటాన్ని అవాక్కయి చూస్తూ నిలబడ్డారు. పెద్ద వర్షం వచ్చి ఒక్కసారి వెలిసినట్టు అయింది.

పైన హాల్లో... సోఫా వెనుకనుంచి అశ్వత్థాను పిస్టల్‌తో పైకి లేచాడు.

సమయం గణితంలో సున్నా లాంటిది. మామూలుగా దానికి ఏ విలువా ఉండదు. కానీ ఒక్కోసారి అది జీవిత చరిత్రలనే మార్చేస్తుంది.

అశ్వత్థామ కళ్యాణి గదిలోకి ప్రవేశించటానికి ఒక్క సెకను ఆలస్యం చేసి ఉంటే అతను మెట్లెక్కి పైకి వస్తోన్న పీటర్ కళ్ళపడి ఉండేవాడు. అదే మరొక సెకను ముందు ఆ గదిలోకి ప్రవేశించి ఉంటే కళ్యాణి హత్య జరిగిపోయి ఉండేది. ఈ రెండూ కాకుండా అశ్వత్థామ కళ్యాణి గది తలుపు తోయబోతోండగా వెనుక నుండి మెట్ల మీద అడుగుల చప్పుడు విన్నాడు. చప్పున మళ్ళీ వెళ్లి సోఫా వెనుక కూర్చుండి పోయాడు.

పీటర్ సరాసరి కళ్యాణి గదిలోకి ప్రవేశించాడు. ప్రక్కమీద పడుకొని ఉన్నామె తలుపు చప్పుడుకి తల తిప్పి చూసింది. ఆమెను చూడగానే... కారణం తెలీదు గానీ, అప్రయత్నంగా అతడి వెన్ను జలదరించింది. ఆమె మొహం అస్తమిస్తున్న సూర్యుడి కంటే ఎర్రగా ఉంది.

''మిమ్మల్ని నేను విజిలెన్స్ ఆఫీసర్‌గా నియమించినప్పుడే 'మీ పని కేవలం నా పరిశ్రమల మీద నిఘా కాదు, నా మనుష్యుల మీద కూడా' అని చెప్పాను. అవునా?'' అంది. ఏ ఉపోద్ఘాతమూ లేకుండా అడిగిన ప్రశ్నకి తడబడి, ''అవును మాడమ్'' అని సమాధానమిచ్చాడు.

''మరి మీరు నా చుట్టూ ఏం జరుగుతోందో ఎప్పుడూ నాకు చెప్పలేదేం? అసలు మీరు ఏ ఒక్క విషయమైనా ఇన్వెస్టిగేట్ చేశారా?''

''చేశాను. కానీ ఏ సాక్ష్యాధారాలూ లేవని మీకు చెప్పలేదు.''

ఆ సమాధానానికి మరింత కోపంగా ''నాకు విషయం చెప్పటానికి సాక్ష్యం ఎందుకు? మొత్తం అంతా అయిపోయాక నాకు చెపుదామనుకున్నారా?'' అడిగింది.

ఆమె కోపానికి అతడు ఏమాత్రమూ బెదర లేదు. చాలా తాపీగా ''ఒకటి... ఏ ఆధారమూ లేకుండా వాళ్ళ మీద నేరారోపణ చేస్తే, వాళ్ళు దాన్ని తెలివిగా దిద్దుకొని మిమ్మల్ని మరో దార్లో 'అటాక్' చేసే ప్రమాదం ఉందని అనుకున్నాను.

రెండు... అనుమానం వస్తే నన్ను కూడా తమ దారి నుంచి తప్పిస్తారని అనుకున్నాను. మూడు... సాక్ష్యం లేకపోతే, నేను చెప్పిన మాటలకన్నా వాళ్ళు చెప్పినదానికే విలువ ఇస్తారనుకున్నాను'' అన్నాడు.

''అనుకున్నాను– అనుకున్నాను– అని అన్నీ మీరు అనుకుంటే సరిపోయిందా? ఎవరి గురించి మీరు నాకు చెప్పదల్చుకున్నది? కార్తికేయ గురించేనా?''

''కాదు. సత్యం గురించి.''

ఒక క్షిపణి నిలువునా మీదపడి విస్ఫోటనం చెందినట్టు ఆమె విస్తుబోయి, ''స...సత్యం గురించా?'' అంది.

''అవును'' అన్నాడు పీటర్. ''...ప్రతాపరెడ్డి, సత్యం కలిసి మిమ్మల్ని హతమార్చాలని ఎన్నాళ్ళనుంచో ప్లాన్ వేశారు. మిమ్మల్ని చంపితే ఆ హత్యానేరం తన మీదకు వస్తుందని సత్యం భయపడ్డాడు. అందుకని ఆగాడు. ఈ లోపులో మీకు కార్తికేయతో వివాహం జరగటంతో వాళ్ళ నోట్లో పచ్చి వెలక్కాయ పడ్డట్లయింది. ఇద్దర్నీ కలిపి చంపినా ఆస్తికి సత్యమే వారసుడు కాబట్టి, నేరం అతని మీదకే వస్తుంది. అందుకని మిమ్మల్నీ, కార్తికేయనీ విడగొట్టడానికి ప్రయత్నించారు.''

కళ్యాణి కిదంతా నమ్మశక్యంగా లేదు. తనలో తనే మాట్లాడుకుంటున్నట్టు ''మీరు సత్యం గురించి నన్ను ముందే హెచ్చరించి ఉండాల్సింది'' అంది.

''ఒకవేళ నన్ను నమ్మి మీరు సత్యాన్ని ఉద్యోగం నుంచి తొలగించినా, వాళ్ళు బయట నుంచి మిమ్మల్ని అటాక్ చేస్తారనుకున్నాను. వాళ్ళని కటకటాల వెనక్కి పంపితే తప్ప మరో మార్గంలేదు. ఈ రోజైనా మీరు ఇలా నిలదీయకపోతే, సాక్ష్యాలు లేవు కాబట్టి సత్యం గురించి చెప్పేవాడిని కాదు. అయినా సత్యం కన్నా ప్రతాపరెడ్డి డేంజర్. విష నాగు. ఆ రోజు మీరు తిన్న రొయ్యల్లో విషం కలపటం కూడా ప్రతాపరెడ్డి చలవే. దానికి సంబంధించిన ఆడియో క్యాసెట్ నా దగ్గర ఉంది.''

కళ్యాణికి విద్యుద్ఘాతం తగిలినట్టయింది. ఆ షాక్ నుంచి బయటకి రావటానికి చాలా సమయం పట్టింది.

''...ప్రతాపరెడ్డి అసలు వేషం అందరి కన్నా ముందు తెలుసుకున్నవాడు కార్తికేయ. అందుకే అతన్ని పని లోంచి తీసేశాడు. దాంతో వాళ్ళ ప్లాన్‌లకు అవరోధం ఏర్పడింది''.

ఆమె నెమ్మదిగా తలెత్తి, ''నేను ఇప్పటివరకూ మిమ్మల్ని నిలదీసింది సత్యం గురించి కాదు. నా భర్త కార్తికేయ గురించి'' అంది.

ఈసారి దిగ్భ్రాంతి చెందటం పీటర్ వంతయింది. అతడికి కార్తికేయ మీద ఉన్న గౌరవం ఈ ప్రపంచంలో ఎవరి మీదా లేదు. ''... కార్తికేయ గురించా?'' అన్నాడు తడారిన గొంతుతో.

''ఏం? కార్తికేయ గురించి మీకు తెలీదా?''.

కార్తికేయ గురించి వ్యతిరేకంగా మాట్లాడితే కళ్ళు పోతాయి అన్నంత నమ్మకంతో ''తెలుసు. అంత గొప్ప వ్యక్తి మరొకరు ఉండరని తెలుసు'' అన్నాడు.

''అంతే తప్ప మరేం తెలీదంటారు?''

''తెలీదు.''

''తెలీదా?'' ఆమె ఒక్కసారిగా స్వరం హెచ్చించింది. ''మీకు అనూజ్ఞ గురించి తెలీదా? ఇద్దరూ సిమ్లా వెళ్ళటం తెలీదా? అక్కణ్ణుంచి అండమాన్ వెళ్ళటం తెలీదా?'' అంటూ చూపు అతనిలోకి చొచ్చుకుపోయేలా సారిస్తూ ''...అదే అనూజ్ఞ ఇప్పుడీ రోజు ఈ ఊళ్ళో రజిత అన్న పేరు మీద ఉండటం తెలీదా? ప్రస్తుతం కార్తికేయ అక్కడికే వెళ్ళాడని కూడా తెలీదా?'' అన్నది.

పీటర్ వెంటనే సమాధానం చెప్పకుండా నెమ్మదిగా అన్నాడు. ''అనూజ్ఞ హోటల్లో ఉందని తెలుసు. అయితే రజిత అన్న పేరుమీద రూమ్ తీసుకోవటానికి కారణం ఆమె కాదు.''

''కాదని నాకు తెలుసు. ఈయనగారు స్నేహితుడిని పంపి బుక్ చేశారు.''

''అది కూడా నిజంకాదు మాడమ్. అశ్వత్థామ అనే డాక్టరు ఉస్మాన్ అని పేరు పెట్టుకుని వెళ్లి ఆమెని పరిచయం చేసుకున్నాడు''.

ఆమె అమితమైన ఆశ్చర్యంతో, ''ఇదంతా మీకెలా తెలుసు?'' అని అడిగింది.

''మీరే కదా మాడమ్ నన్ను 'కేవలం ఆఫీసే కాకుండా' అన్ని విషయాలూ ఎంక్వయిరీ చేయ్యమనారు. చాలా రోజుల్నుంచి మన మనుష్యులు ఆ ముగ్గుర్నీ నీడలా వెంటాడుతున్నారు'' అన్నాడు 'అన్ని'' అన్న పదాన్ని వత్తి పలుకుతూ.

సోఫా వెనుక ఉన్న అశ్వత్థామకి మతిపోయింది. సన్నగా వణికాడు.

పీటర్ మొత్తం అంతా చెప్పటం ప్రారంభించాడు. దాదాపు అరగంట సేపు – జరిగినదంతా వివరించాడు. అంతా విని ఆమె ఒకేమాట అంది. ''పీటర్... నేను హోటల్ తాజ్ ఇంటర్‌నేషనల్‌కి వెళ్ళాలి, కారు సిద్ధం చేయించండి.''

పీటర్ అదిరిపడి ''మీరు హోటల్‌కా?'' అన్నాడు.

''అవును. ఏం? ఎలక్ట్రిక్ షాక్‌ల కోసం ఆస్పత్రికి వెళ్ళటంలేదూ... అలాగే.''

''అది కాదు మాడమ్... ఎందుకూ అని.''

''అనూజ్ఞ కోసం అశ్వత్థామ ఎయిర్‌పోర్టుకి వెళ్ళటం, సత్యం నా ముందు నుంచే కార్తికేయకు ఫోన్ చేయటం, ఇదంతా చూస్తుంటే శత్రువులు ఏదో పెద్ద ప్లాన్ వేసారని అనిపిస్తోంది.''

''కానీ మీరక్కడికి వెళ్ళటం...'' నసిగాడు.

''పీటర్! ఇన్నాళ్ళూ వ్యాపారజీవితంలో నా అంచనా ఎప్పుడూ తప్పు కాలేదు. ఏదో జరగబోతోంది'' డ్రైవర్ని పిలవటానికి ఇంటర్‌కమ్ తీసుకుంది.

సోఫా వెనుకనుంచి వింటూన్న అశ్వత్థామకి ఏం చేయాలో తోచలేదు. ఆమె వెళ్లటం ఖాయమని తెలిసాక తను అక్కడ ఉండి చేసేదేమీ లేదనిపించింది.

''మాడమ్. మరొక్కసారి ఆలోచించండి. వాళ్ళిద్దరూ అక్కడ ఉండగా మీరు వెళితే బాగోదు. రేప్రొద్దున్న ఎవరికైనా ఈ గొడవ సంగతి తెలిస్తే హాస్యాస్పదంగా ఉంటుంది. కావాలంటే ఆ అమ్మాయి సంగతి మీ భర్త ఇంటికొచ్చాక నిలదీయండి'' అన్నాడు లోపల పీటర్.

ఒక చేత్తో ఇంటర్‌కమ్ పట్టుకొని, మరొకచేత్తో డ్రైవర్‌ని పిలవటానికి బటన్ నొక్కబోతున్న శ్రీకళ్యాణి, పీటర్‌వైపు అభావంగా చూసి, నెమ్మదిగా అంది. ''నిలదీయటం ఏమిటి పీటర్? మీరు నా గురించి ఏమనుకున్నారు? నా వెనుక నాకు తెలియకుండా ఇదంతా జరుగుతోందన్న కోపమే తప్ప, కార్తికేయ... అనూజ్ఞ ఒకరినొకరు ఇష్టపడితే కాదంటానా నేను?''

ఆ వృద్ధుడికి అంత పెద్ద విద్యుద్ఘాతం జీవితంలో ఎప్పుడూ తగిలి ఉండదు.

''మానవ సంబంధాలన్నీ వ్యాపార సంబంధాలని నమ్మిన నేను, నా భర్త సహచర్యంలో నా అభిప్రాయం తప్పేమో అని నా అభిప్రాయాలు మార్చుకోబోతున్న తరుణంలో 'కాదు, నీ అభిప్రాయమే కరెక్టు' అని నా భర్తే స్వయంగా నిరూపించ బోతోంటే కాదంటానా? ఎందుకూ పనికి రాని ఓ కట్టెతో కాపురం చేయటం కన్నా తనకి ప్రేరణనిచ్చే అమ్మాయిని వివాహం చేసుకుంటానంటే ఎందుకు కాదంటాను? నా బాధల్లా 'ఇంత చిన్న విషయం నాకు తెలియకుండా జరుగుతోందే... ఇన్నాళ్ళ సహచర్యంలో నా థియరీలని నా భర్త అర్థం చేసుకోలేకపోయాడే' అని మాత్రమే...''

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments